సాక్షి
సిద్దిపేట

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



శనిగరం రిజర్వాయర్ మత్తడి పరవళ్లు, (ఇన్‌సెట్‌లో) పర్యాటకుల సందడి

జలసవ్వడి.. జన సందడి

కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని జలాశయాలన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. కోహెడ మండలంలోని శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు మత్తడి దుముకుతోంది. అలాగే జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌లోని రాచకట్ట జలాశయం పూర్తిస్థాయిలో నిండింది. ఇటిక్యాల గ్రామంలో కూడవెల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం పొంగిపొర్లుతోంది. జలాశయాలను చూసి రైతులు, ప్రజలు పరవశించిపోతున్నారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో సందడిగా మారాయి.

–కోహెడరూరల్(హుస్నాబాద్)/ జగదేవ్‌పూర్(గజ్వేల్)



తిగుల్‌లో రాచకట్ట జలాశయం..

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ ఆనంద్

నంగునూరు(సిద్దిపేట): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తగా ఉండాలని ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్ అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం పాలమాకుల ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఏఎన్ఎం సబ్‌సెంటర్ ద్వారా విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆనంద్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆయన వెంట రాజగోపాల్‌పేట పీహెచ్‌సీ వైద్యాధికారి సరిత, హెచ్‌ఈఓ స్వామి, సూపర్‌వైజర్ అనురాధ, వార్డెన్ గణేశ్, ఏఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ మహేందర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

సిద్దిపేటకమాన్: ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్, మగ్గం వర్క్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అధ్యక్షురాలు స్వరూపరాణి తెలిపారు. ఈ నెల 6నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, 30రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు తమ పూర్తి వివరాలతో పాత బస్టాండ్ వద్ద ఉన్న దేవీనిలయం మొదటి అంతస్తులోని సంస్థ అడ్రస్‌లో సంప్రదించాలని సూచించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఇబ్రహీంనగర్ పీహెచ్‌ఎస్‌లో వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

చిన్నకోడూరు, ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రేవతి అన్నారు. సోమవారం చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ పీహెచ్‌సీ, సిద్దిపేట పట్టణంలోని బస్తీ దవాఖానాను ఆకస్మికంగా సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు భారీగా కురుస్తున్నందున ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థాయిలో అన్ని గ్రామాల్లో అత్యవసర సేవలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షం నీరు నిలవడం ద్వారా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇంటి పరిసరాల్లో డ్రై డేను పాటిస్తూ నీటి నిల్వలను తొలగించాలన్నారు. అవసరమైన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు విజయ్ కృష్ణ, మౌనిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవాపూర్ పెద్ద చెరువుకు గండి

వెంటనే స్పందించిన అధికారులు



చెరువుకు పడిన గండి

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని రాఘవాపూర్ పెద్ద చెరువుకు వరద ఉధృతి పెరగడంతో సోమవారం ఉదయం గండి పడింది. దీంతో అప్రమత్తమైన పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు చెరువు వద్దకు చేరుకున్నారు. జేసీబీ సాయంతో రాళ్ళను, మట్టిని తీసుకువచ్చి గండిపూడ్చి సమస్యను పరిష్కరించారు. నీరు తగ్గిన తర్వాత శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్ద చెరువు కావడంతో ఏమాత్రం ఆలస్యం జరిగినా ప్రమాదం జరిగి ఉండేదని సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికిరణ్, ఎంపీడీఓ మురళీధర్ శర్మ, ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వంతెనలు లోలెవల్.. వెతలు హైలెవల్

జిల్లాలో లోలెవల్ వంతెనలతో ప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన రహదారులపై ఉన్న బ్రిడ్జిల మీదుగా వరద ప్రవహిస్తుండటంతో అవస్థలు అన్నీ ఇన్నీకావు. అత్యవసర పరిస్థితుల్లో బ్రిడ్జిని దాటే ప్రయత్నంలో చాలా మంది ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. జిల్లాలో పలు చోట్ల హైలెవల్ వంతెనల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇంకా కొన్ని చోట్ల వంతెనలు నిర్మించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – సాక్షి, సిద్దిపేట

నిలుస్తున్న రాకపోకలు

- వానొస్తే రహదారులపై వరదలు
- రోజుల తరబడి ప్రయాణాలు బంద్
- దృష్టిసారించని పాలకులు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

సిద్దిపేట నుంచి హుస్నాబాద్ జాతీయ రహదారి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా బస్వాపూర్ సమీపంలో మోయతుమ్మెద వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం పనులను ప్రారంభించారు. అవి నత్తనడకన సాగుతున్నాయి. అదే సదరు కాంట్రాక్టర్ పనులు త్వరగా పూర్తి చేస్తే ఈ సారి వాహనదారులకు ఇబ్బందులు తప్పేవి. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతుండటంతో తాత్కాలికంగా అప్రోచ్ రోడ్ వరదకు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోరెడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రారంభం కానీ పనులు

చేర్యాల మండలంలోని కడవేర్గు గ్రామ శివారులో లోలెవల్ బ్రిడ్జి స్థానంలో తాత్కాలిక వంతెన నిర్మాణం కోసం గతంలో శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు. దీంతో వర్షకాలంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కడవేర్గు మీదుగా పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి, నాగపురి మీదుగా యాదగిరిగుట్ట, జగదేవపూర్ వెళ్లే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని పనులు పూర్తయ్యేవిధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిడ్జికి మోక్షం ఎప్పుడో...

మిరుదొడ్డి మండలం అల్వాల శివారు కూడవెల్లి వాగుపై ఉన్న హైలెవల్ వంతెన నిర్మాణానికి ఆర్ అండ్ బీ రూ.4కోట్ల నిధులు మంజూరు చేసింది. స్థల వివాదం కారణంగా పిల్లర్ల దశలోనే నిర్మాణం ఆగిపోయింది. దీంతో తొమ్మిదేళ్ల గడిచినా బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. ప్రస్తుతం ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరద పోటెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి వద్ద జాతీయ రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వరద



శనిగరం సమీపంలో మునిగిన పత్తి పంట

1,323 ఎకరాల్లో పంట నష్టం

జిల్లా వ్యాప్తంగా 1,323 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. వరి 636, మొక్కజొన్న 97, పత్తి 690 ఎకరాల్లో నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. 884 మంది రైతులకు నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

18 రోడ్లు ధ్వంసం

పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖకు చెందిన 18 రోడ్లు పలు చోట్ల ధ్వంసం అయ్యాయి. వీటిని తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.18.9లక్షలు అవసరం అని గుర్తించారు. పూర్తి స్థాయిలో పనుల నిర్మాణం కోసం రూ. 1.89కోట్లు కావాలని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ఆర్అండ్‌బీ రోడ్లు 24 చోట్ల కోతలకు గురయ్యాయి.

వంతెన నిర్మాణం చేపట్టాలి



వర్షం పడితే చాలు లోలెవల్ వంతెన వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. రాకపోకలు బంద్ కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించాలి.

– దేవులపల్లి శ్రీకాంత్, నాగపురి

రహదారి పనులు వేగిరం చేయండి

- 15 రోజుల్లోగా పూర్తికావాలి
- వరద నీటికి శాశ్వత చర్యలు చేపట్టాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: పట్టణంలో జరుగుతున్న జాతీయ రహదారి, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల పనులు 15 రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డెడ్‌లైన్ విధించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ జాతీయ రహదారి పనులు ప్లానింగ్ ప్రకారం నిర్వహించకుండా అతుకుల బొంతలాగా సగం సగం పనులు చేస్తున్నారని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ స్తంభాలు తొలగించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పోతారం (ఎస్) నుంచి పట్టణంలోకి వచ్చే వరద నీరు డ్రైనేజీలో సక్రమంగా వెళ్లేలా ఇంజనీరింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులు ఎవరు అడ్డుకున్నా పోలీస్ భద్రతను ఏర్పాటు చేయాలని ఏసీపీ సతీష్‌ను ఆదేశించారు. జాతీయ రహదారిలో ఎంక్రోచ్‌మెంట్ చేయాల్సిన ఇళ్లను మూడు రోజుల సమయం ఇచ్చి పూర్తి చేయాలని సూచించారు. మున్సిపాలిటి పరిధిలో ఖాళీగా ఉన్న నీటి నిల్వలు, గడ్డి పొదలు ఉన్నా నోటీసులు జారీ చేయాలన్నారు. నియోజకవర్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలు ఇవ్వాలన్నారు.

మూడు మండలాలపై సమీక్ష

హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ఎక్కడ వ్యాధి లక్షణాలు ఉన్నా వెంటనే వైద్యం అందించాలన్నారు. హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ రెడ్డికి సూచించారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్ పర్సన్ అనిత, కౌన్సిలర్లు, ఆర్డీఓ, పోలీస్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

నక్షత్ర దీక్ష విరమణ

భద్రకాళీ సమేత కొత్తకొండ వీరభద్ర స్వామి నక్షత్ర దీక్షను మంత్రి పొన్నం సోమవారం విరమించారు. 27 రోజుల పాటు మంత్రి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఇరుముడితో ఇతర స్వాములు, కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి కాలినడకన కొత్తకొండ గుట్ట పైకి ఎక్కి శివలింగాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



ఇరుముడితో మంత్రి పొన్నం ప్రభాకర్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- గజ్వేల్ ప్రాంత అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సారెడ్డి తదితరులు

గజ్వేల్: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కొత్తగా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్ తదితరులు షబ్బీర్‌అలీని నగరంలో కలిశారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంత అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడతానని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలకు ప్రజల్లో విశేష ఆదరణ ఉన్నదని, అర్హులకు పథకాలు దరి చేరేలా కృషి చేయాలని నేతలకు సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి సముచిత గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్ తంజిముల్ మసాజిద్ కమిటీ అధ్యక్షుడు మతిన్‌తో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, బోస్, రాములుగౌడ్, శివారెడ్డి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వైఎస్సార్

కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పేదల పెన్నిధి వైఎస్ రాజశేఖరరెడ్డి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న ఉద్దేశంతోనే ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారని తెలిపారు. 108, 104 వాహనాలను తీసుకువచ్చి పేదలకు వైద్యం మరింత చేరువ చేశారని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత రాజశేఖరరెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, యూత్ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రటరీ పూజల గోపి కృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి, కౌన్సిలర్‌లు, పార్టీ సీనియర్ కలీమొద్దీన్, సాకి ఆనంద్., బుచ్చి రెడ్డి, రియాజుద్దీన్, ఎల్లం యాదవ్, పాండు, సాంబమూర్తి, రవి, కొత్త మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసాన్ని విజయవంతం చేద్దాం

సిద్దిపేటరూరల్: పోషణ మాసం కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు చేపడుతున్న గొప్ప కార్యక్రమమన్నారు. అధికారులు వందశాతం విజయవంతం చేయాలన్నారు.

అభివృద్ధి ప్రదాత ముత్యంరెడ్డి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



ముత్యంరెడ్డి విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డికే దక్కిందని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. మండలంలోని తుక్కాపూర్‌లో వ్యవసాయ క్షేత్రంలో ముత్యంరెడ్డి 5వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముత్యంరెడ్డి విగ్రహానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యంరెడ్డి చేపట్టిన అభివృద్ధి పథకాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. భావితారల బాగుకోసం ముందుచూపుతో విద్య, వైద్యం, వ్యవసాయ, రవాణా, విద్యుత్ రంగాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని ఆయన సేవలను గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి నిలిచిపోయిందని ఆరోపించారు. మారుమూల పల్లెల్లో ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి పనులు నేటికీ కనిపిస్తున్నాయని గుర్తుచేశారు. ఆయన తనయుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ముత్యంరెడ్డి సతీమణి విజయమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ ప్రజా ప్రతినిధులు, ముత్యంరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాచారం రైల్వేస్టేషన్‌కు హంగులు

- వేగంగా పునరుద్ధరణ పనులు
- ప్రయాణికులకు సౌకర్యాలు
- సీసీ రోడ్డు నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్

వర్గల్(గజ్వేల్): 'సాక్షి' కథనం రైల్వే అధికారులలో కదలిక తెచ్చింది. సౌకర్యాల కల్పన, పునరుద్ధరణ పనులకు మోక్షం కలిగింది. 'నాచారం.. ఇదేం గ్రహచారం' శీర్షికతో ఆగస్టు 3న 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. అసాంఘిక శక్తుల విధ్వంసం, స్టేషన్‌లోని ఎక్విప్‌మెంట్లు, ఫర్నిచర్, స్విచ్‌బోర్డులు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు తదితర తదితర సామగ్రిని అపహరించారు.

పనులు ప్రారంభం

'సాక్షి' కథనంతో నాచారం రైల్వే స్టేషన్‌లో కమీషనింగ్ (పునరుద్ధరణ) పనులపై అధికారులు దృష్టి సారించారు. పనుల కోసం అవసరమైన వివిధ మెటీరియల్, ఇనుప విండో ఫ్రేమ్‌లు, వెల్డింగ్ పరికరాలను తెప్పించారు. పెద్ద ఎత్తున లేబర్‌ను రప్పించారు. పనుల్లో వేగం పెంచారు. రైల్వే అధికారుల పర్యవేక్షణలో ఇప్పటికే వెంకటాయపల్లి–నాచారం రోడ్డును లింక్‌చేస్తూ నాచారం స్టేషన్ వరకు సీసీ అప్రోచ్‌రోడ్డు వేశారు. ప్రహరీలు నిర్మించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. స్టేషన్ వద్ద ఇనుప తలుపులు, కిటికీలు బిగిస్తున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ, రిలే రూం, ప్యానెల్‌బోర్డుల బిగింపు, వివిధ పరికరాల ఏర్పాటు, టాయిలెట్ బ్లాకులు, విశ్రాంతి గదులు తదితరాల పనులు ఊపందుకుంటున్నాయి.



నాచారం స్టేషన్ దాకా నిర్మించిన సీసీ రోడ్డు, (ఇన్‌సెట్) నాచారం స్టేషన్ ఎంట్రెన్స్ వద్ద చేపట్టిన సిమెంట్ పనులు

ఆరునెలల్లోగా పూర్తి

ఆరు నెలల్లోగా నాచారం రైల్వేస్టేషన్ కమీషనింగ్ పనులన్నీ పూర్తవుతాయని రైల్వేశాఖ ఈఈ మూర్తి పేర్కొన్నారు. రైల్వే ప్రయాణికుల సౌలభ్యం కోసం సిమెంట్, కాంక్రీట్‌తో ఇటీవలే స్టేషన్ వరకు అప్రోచ్‌రోడ్డు నిర్మించామన్నారు.

క్లుప్తంగా

దుబాయ్ నుంచి మృతదేహాన్ని తెప్పించండి

- రఘునందన్‌రావును కలిసిన నేతలు



ఎంపీ రఘునందన్‌రావుతో నేతలు

మెదక్‌జోన్ : మెదక్ మండలం తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన రాట్ల సూర్య గత నెల 6న బతుకు దెరువు కోసం ఓ ఏజెంట్ ద్వారా దుబాయ్ వెళ్లాడు. అదే నెల 30న మరణించినట్లు ఏజెంట్ ద్వారా విషయాన్ని గ్రామస్తులకు తెలిసింది. దీంతో సోమవారం ఆ గ్రామ సర్పంచ్ ఎలక్షన్‌రెడ్డి తోపాటు బీజేపీ నేతలు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిసి మృతదేహాన్ని ఇండియాకు తెప్పించాలని కోరారు. స్పందించిన రఘునందన్‌రావు దుబాయ్‌లోని భారత రాయబారి సంస్థతో మాట్లాడాడు.ఎంపీని కలిసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



దుర్గా ప్రసాద్ (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. సిద్దిపేట త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన బుట్టి దుర్గా ప్రసాద్ ప్రైవేటు ఉద్యోగి. గత నెల 27న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం మిట్టపల్లి నుంచి ఎల్లుపల్లికి వెళ్లే దారిలో గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడికి చేరుకొని గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి విచారించగా బుట్టి దుర్గప్రసాద్‌గా తేలింది. మృతుడు కొద్ది కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడని, బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయాడని మృతుడి భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొట్టడంతో ఒకరు..

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సిద్దిపేట అర్బన్ మండలం బక్రీచెప్యాల గ్రామానికి చెందిన శ్రీనివాస్ (42) పని నిమిత్తం సోమవారం పట్టణానికి వచ్చాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మధ్యలో ఆగాడు. బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం అందించారు.

పారదర్శకంగానే పంట రుణాలు

- సహకార సంఘం చైర్మన్ శివయ్య



మాట్లాడుతున్న శివయ్య

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ సహకార సంఘం భద్రత కోసం మార్ట్‌గేజ్‌తో పంట రుణాలు తీసుకున్నామని చైర్మన్ బొలిశెట్టి శివయ్య తెలిపారు. సంఘం కార్యాలయంలో సోమవారం సీఈఓ తిరుమలతో కలిసి సాక్షిలో వచ్చిన 'దారుణం' కథనానికి స్పందించి పంట రుణాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం కిందట తహసీల్దార్ కార్యాలయంలో మార్ట్‌గేజ్‌ను తిరస్కరించిన రైతులకు రుణాలు ఇవ్వలేదన్నారు. సంఘం పాలకవర్గం తీర్మానం, అధికారుల సూచనల మేరకే రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ధరణి ఆన్‌లైన్ రికార్డులను తీసుకొచ్చిన రైతులకు పంట రుణం మంజూరు చేయాలంటే సంఘం సెక్యూర్ కోసం భూమిని మార్ట్‌గేజ్ చేసుకుంటున్నామని తెలిపారు. బోగస్ పట్టాదారు పాసు పుస్తకాలు ఉంటేవాటిని మార్ట్‌గేజ్ సమయంలో రెవెన్యూ అధికారుల పరిశీలనలో బయటపడితే వారికి రుణాలను తిరస్కరిస్తున్నామన్నారు. సహకార సంఘంలో ఇప్పటి వరకు రైతులకు ఇచ్చిన రుణాలు పారదర్శకంగానే ఉన్నాయని వెల్లడించారు.

సర్కారు బడిలో సాంకేతిక విద్య

విద్యార్థులకు భవితకు కంప్యూటర్ చాన్స్

- నారాయణఖేడ్‌లోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో నేడు ప్రారంభం
- ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు శిక్షణ
- స్వచ్ఛంద సంస్థ సహకారం, ఎమ్మెల్యే కృషితో ఏర్పాట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను కార్పొరేట్ పాఠశాలలో చదివే విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టింది. కేవలం బట్టీ చదువులు కాకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కాలంతోపాటు పోటీపడుతూ చిన్నతనం నుంచే సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోనున్నారు. ఇందులో భాగంగా నారాయణఖేడ్‌లోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో నేడు కంప్యూటర్ విద్యను ప్రారంభించనున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో ప్రత్యేకంగా తెచ్చిన కంప్యూటర్లను ఏర్పాటు చేశారు.

–నారాయణఖేడ్



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు

కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా కంప్యూటర్ విద్యను ప్రారంభిస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌లో మూడు ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య బోధనకు చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌లోని బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా నారాయణఖేడ్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ విద్యాబోధనకు ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం నుంచి బోధనను ప్రారంభించనున్నారు.

అధ్యాపకులను నియామకం

ఒక్కో పాఠశాలలో సుమారు 900 మంది చిన్నారులు చదువుతున్నారు. ఆరవ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ సహకారానికి తోడు ఎమ్మెల్యే కొంత సహకారం అందిస్తూ పాఠశాలల్లో కంప్యూటర్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటు చేయించారు. ఇప్పటికే పాఠశాలల్లో ప్రత్యేకంగా తెచ్చిన కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. పాఠశాలకు ఒకరు చొప్పున కంప్యూటర్‌ను బోధించే అధ్యాపకులను నియమించారు. వారికి స్వచ్ఛంద సంస్థ సహకారంతో వేతనం చెల్లించనున్నారు.

మూడు నెలలు శిక్షణ

కంప్యూటర్ ఎడ్యుకేషన్, త్రీడీ క్లాసులు, హెల్త్, యోగా, సమాజంలో ఎలా ఉండాలి తదితర అంశాలపై విద్యార్థులకు మూడు నెలల శిక్షణ ఇస్తారు. క్రమశిక్షణ, ఆరోగ్యం, నైతిక విలువలు, పర్యావరణ పరిరక్షణ, కంప్యూటర్ విద్య బోధన జరగనుంది. పాఠశాలలకు ఇంటర్‌నెట్ సదుపాయం కూడా కల్పించారు. సంస్థ చైర్మన్ కృష్ణ పారిశెట్టి, సంస్థ ప్రతినిధులైన వాలేరో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇండియా ఆపరేటింగ్ హెడ్ ఫణికుమార్ సింహాద్రి, మార్కెటింగ్ మేనేజర్ కార్తీక్ కోరుకొండ, వంశీలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను పరిశీలించి ప్రారంభానికి సిద్ధం చేశారు.

కంప్యూటర్ బోధనతో మేలు



మా పాఠశాలలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కంప్యూటర్ బోధన చేపడుతున్నారని తెలియడంతో ఎంతో సంతోషించాను. చదువుతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ఎంతో అవసరం. నేడు సమాజంలో ఎదిగేందుకు కంప్యూటర్ పరిజ్ఞానం అన్నింట్లోనూ ఉపయోగపడుతుంది. తప్పకుండా తర్ఫీదు పొందుతాను.

– మధుశ్రీ, 10 వ తరగతి

పేద విద్యార్థులకు ఉపయోగం



డబ్బులు వెచ్చించి కంప్యూటర్ బోధన చేయడం సాధ్యం కాదు. పాఠశాలలో ఉచితంగానే బోధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్యం కంప్యూటర్ క్లాసులకు వెళ్తాను. ఎన్నో రోజులుగా ఉన్న కంప్యూటర్ నేర్చుకోవాలనే ఆశ నెరవేరుతుంది. మా లాంటి పేద విద్యార్థులకు ఇలాంటి సదుపాయం కల్పించడం సంతోషకరం.

– మీరా, 8వ తరగతి

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి



తాను మొదటి నుంచి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాను. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేది పేద విద్యార్థులు కావడంతో కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని, తద్వారా జీవితంలో ఎదిగేందుకు తోడ్పాటు అవుతుందని భావిస్తున్నా. అందుకే హైదరాబాద్‌కు చెందిన బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కృష్ణ పారిశెట్టి సహకారంతో పట్టణంలోని అత్యధిక విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రారంభింప చేయిస్తున్నాను.

– డాక్టర్ సంజీవరెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే

ట్రస్ట్ పేరిట సైబర్ మోసం

- రూ.2 వేలు పంపితే.. రూ.18,500 ఇస్తామని నమ్మబలికి
- 100 మంది నుంచి రూ.2 లక్షలు వరకు వసూలు

పాపన్నపేట(మెదక్): 'రూ.2 వేలు మీరు వేయండి.. 5 నిమిషాల వ్యవధిలో రూ.18,500 మేము పంపిస్తాం. ఇది కేవలం పేద కుటుంబాలకు ఇస్తున్న బంపర్ ఆఫర్ అంటూ ఓ ట్రస్ట్ పేరిట కొంత మంది నేరస్తులు సైబర్ క్రైమ్‌కు తెరలేపారు. దాదాపు 100 మంది నుంచి రూ.2 లక్షల వరకు కాజేశారు. బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. 'శ్రీ ఏడుపాయల వన దుర్గా భవానీ ప్రెస్' పేరిట 2, అక్టోబర్ 2020 నాడు కొందరు ఓ వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. ఇందులో 537 మంది సభ్యులున్నారు. ఇటీవల 28 ఆగస్టు 2024 నాడు ట్రస్ట్ లైఫ్ దిల్ పేరిట (ఫోన్ నెం.76720 20853) ఒక మెసేజ్ చేశారు. అందులో 'శ్రీ హర్ష సాయి ట్రస్ట్' ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు చేయూతనిచ్చే ఉద్దేశ్యంతో దరఖాస్తుదారులు రూ.2 వేలు పంపితే, 5 నిమిషాల వ్యవధిలో తాము వారి నంబర్‌కు రూ.18,500 పంపుతామని తెలిపారు. గ్రూపు దేవుడి పేరిట ఉండటంతో అందులో ప్రెస్ పేరు కూడా ఇమిడి ఉండటంతో చాలా మంది అమాయకులు వాళ్లు ఇచ్చిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి రూ.2 వేలు పంపారు. ఇది జరిగిన మరు నిమిషంలోనే మోసగాళ్లు వారిని గ్రూపు నుంచి డిలీట్ చేశారు. బాధితులు ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తుంది. మెదక్, కామారెడ్డి జిల్లాలకు చెందిన సుమారు 100 మందికి పైగా బాధితుల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయమై తాను సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్ ఫిర్యాదు చేసినట్లు పాపన్నపేటకు చెందిన చెరువుపల్లి నవీన్ తెలిపారు. పోలీసులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, మరి కొంత మంది మోసపోకుండా చూడాలని ఆయన కోరారు.

పార్క్ చేసిన బైక్‌లే లక్ష్యంగా..

- చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులు అరెస్ట్
- 25 మోటారు సైకిళ్లు, రూ.15 వేలు స్వాధీనం



నిందితులను చూపుతున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను జహీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం వెల్లడించారు. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ కాశీనాథ్ పోలీసు సిబ్బందితో కలిసి పట్టణంలోని అల్గోల్ రోడ్డులో పరంపర స్వీట్ హౌస్ ప్రాంతంలో వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ముగ్గురు యువకులు బైక్‌లపై జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా బైక్‌ల చోరీలు బయటపడ్డాయి. జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఎండీ షఫీ, బాబుమోహన్ కాలనీకి చెందిన ఎండీ జుబేర్, రాయికోడ్ మండలంలోని శంశోద్దీన్‌పూర్‌కు చెందిన మచుకూరి వినోద్‌కుమార్ ముగ్గురూ కలిసి పార్కు చేసిన వాహనాలను మారు తాళాలతో దొంగలించినట్లు విచారణలో తెలిపారు. ఆరు నెలల నుంచి జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట్ ప్రాంతాల్లో 25 బైక్‌లు, ఒక ఆటోను చోరీ చేశారు. వారి వద్ద నుంచి రూ.15 లక్షల విలువ చేసే మోటారు సైకిళ్లు, ఆటోను స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టులో రిమాండ్ చేశామని డీఎస్పీ వివరించారు. బైక్ దొంగలను పట్టుకున్న ఎస్‌ఐ కాశీనాథ్, సిబ్బందిని ఆయన అభినందించారు.

విద్యుత్ సిబ్బంది సమన్వయ లోపం.. కూలీ పాలిట శాపం

- విద్యుదాఘాతంతో ఆస్పత్రిపాలు



చికిత్స పొందుతున్న శివ

గజ్వేల్‌రూరల్: అతను ఓ రోజువారీ కూలీ, ఎప్పుడు పని ఉన్నా వచ్చి విద్యుత్ సిబ్బందికి సహకారం అందిస్తుంటాడు. విద్యుత్ లైన్ బ్రేక్ డౌన్ కావడంతో విద్యుత్ లైన్‌మెన్ (ఏఎల్ఎం) చెప్పగా వెంటనే వచ్చి స్తంభంపైకి ఎక్కాడు. మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీగిరిపల్లి చౌరస్తా వద్ద సోమవారం చోటు చేసుకుంది. విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్తుల కథనం మేరకు.. మండల పరిధిలోని అక్కారం గ్రామానికి చెందిన మెతుకు శివ ఓ కాంట్రాక్టర్ వద్ద విద్యుత్ పనులకు రోజువారి కూలీగా వెళ్తుంటాడు. ఇదే క్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో పరిచయం ఏర్పడింది. ప్రజ్ఞాపూర్ సబ్‌స్టేషన్ నుంచి అంగడి కిష్టాపూర్ వరకు సుమారు 15 కిలో మీటర్ల పొడవున ఉండే 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్ ఆదివారం రాత్రి బ్రేక్ డౌన్ అయింది. అదే రాత్రి శ్రీగిరిపల్లి చౌరస్తా వద్ద 11 కేవీ లైన్ ఏబీస్విచ్‌ను ఓపెన్ చేసి సప్లయ్ ఇచ్చారు. సోమవారం ఉదయం ఏఎల్ఎం యుగంధర్ పని ఉందని చెప్పడంతో శివ శ్రీగిరిపల్లి చౌరస్తాకు రాగా సబ్‌స్టేషన్‌లో ఉండే ఆపరేటర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి ఎల్‌సీ తీసుకున్నట్లు యుగంధర్ పేర్కొన్నారు. ఫీడర్ లైన్ ఉన్న స్తంభంపైకి శివ ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన శివను యుగంధర్ ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బాధిత కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయలోపంతోనే ఈ ఘటన జరిగిందని, గతంలో సైతం పలుమార్లు విద్యుత్ ప్రమాదాలు జరిగాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈ సత్యంను వివరణ కోరగా.. 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్ బ్రేక్‌డౌన్ కావడంతో ఏఎల్ఎం యుగంధర్ మరమ్మతు పనులు చేసేందుకు సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్నట్లు తెలిపాడని, అదే సమయంలో విద్యుత్ సరఫరా ఎలా జరిగిందో తెలుసుకునేందుకు విచారణ చేపడుతున్నామని తెలిపారు.

నెల రోజులుగా 84 గొర్రెలు మృత్యువాత

- జీవనాధారం కోల్పోయిన జక్కాపూర్ గ్రామ కాపరి దేవయ్య

సిద్దిపేటరూరల్: పశువులు, గొర్రెల కాపరులు వర్షాకాలం సమయంలో అప్రమత్తంగా ఉంటూ వాటిని రక్షించుకోవాలని పశువైద్యాధికారులు సూచించారు. నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామానికి చెందిన నిరుగొండ దేవయ్యకు చెందిన గొర్రెలు నెల రోజులుగా పలు రకాల వ్యాధులతో మృతి చెందుతున్నాయి. సోమవారం రెండు గొర్రెలు మృతిచెందగా మొత్తంగా 84 జీవాలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సంబంధిత మండల స్థాయి అధికారులకు సమాచారం అందించారు. అధికారుల బాధితుడి వద్దకు వెళ్లి గొర్రెల మృతికి కారణాలు తెలుసుకున్నారు. చనిపోయిన గొర్రెను ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షలు చేస్తామని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం సాయం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీరాములు, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, పశువైద్యాధికారి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మీ, మైనార్టీ ఉపాధ్యక్షుడు కలీం, సీనియర్ నాయకులు పాండు, డీసీసీ ప్రధాన కార్యదర్శి రాజీవీర్ పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న అధికారులు

'సకురా' ప్రోగ్రామ్‌కు నలుగురు ఎంపిక



ఎంపికైన ప్రొఫెసర్లతో విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు, ఇతర ప్రతినిధులు

- ఔషధ మొక్కల డీఎన్ఏ శ్రేణి విశ్లేషణపై జపాన్‌లో శిక్షణ
- 2 నుంచి 13 వరకు నిర్వహణ

నర్సాపూర్ : శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ నుంచి నలుగురు ప్రొఫెసర్లు 'సకురా' సైన్స్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారని సొసైటీ చైర్మన్ విష్ణురాజు తెలిపారు. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ, గవర్నమెంట్ ఆఫ్ జపాన్, డాక్టర్ యుకియో నాగానో మద్దతుతో సాగా యూనివర్సిటీలో జరిగే ఔషధ మొక్కల డీఎన్ఏ శ్రేణి విశ్లేషణపై ఈ ప్రొఫెసర్లు అధునాతన శిక్షణ పొందుతారని తెలిపారు. సొసైటీ పరిధిలో కొనసాగుతున్న తమ కాలేజీలకు చెందిన ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ రాజు, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ భానుప్రకాశ్, డాక్టర్ సంతోష ఈనెల 2 నుంచి 13 వరకు జరిగే సకురా స్పాన్సర్ చేసిన సైన్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనడానికి జపాన్ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ప్రొఫెసర్లను చైర్మన్ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విస్సాం, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ రమేశ్, నటరాజ్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపికైన ప్రొఫెసర్లు మాట్లాడుతూ.. పరిశోధనలు చేసేందుకు సొసైటీలోని ఆయా కాలేజీల్లో పని చేసే వారికి అండగా ఉంటున్న చైర్మన్ విష్ణురాజుకు ధన్యవాదాలు తెలిపారు.

జాలరి కోసం కొనసాగుతున్న గాలింపు



గాలింపు చర్యల్లో ఎమ్మెల్యే సత్యనారాయణ, సీఐ శ్రీనివాస్, తదితరులు

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి కల్వర్టు వద్ద చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన జాలరి సందిరి లక్ష్మణ్ కోసం సోమవారం గాలింపు చర్యలు కొనసాగాయి. స్థానిక జాలరులు, ఫైర్ సిబ్బందితో పాటు సిద్దిపేట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ క్రిష్ణారెడ్డి కాల్వలో దిగి గాలించినా ఫలితం లేకపోయింది. లక్ష్మణ్ తీసుకెళ్లిన సంచితోపాటు అతడి చెప్పులు కాల్వలో లభించగా అతడు ఎక్కడైనా చిక్కుకో వచ్చని భావించి తీవ్రంగా గాలిస్తున్నారు. వర్షం కారణంగా వెతకడం ఇబ్బందికరంగా మారింది. ఘటనా స్థలానికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వచ్చి పలు సూచనలు చేశారు. లక్ష్మణ్ కుమారుడు శ్రవణ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, బెజ్జంకి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల జగపతి రావు, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ పార్టీ అధ్యక్షుడు దామోదర్, మాజీ సర్పంచ్ నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలోనే రైతుల సమస్యల పరిష్కారం

- అందోలు–జోగిపేట ఆర్డీఓ పాండు



మాట్లాడుతున్న ఆర్డీఓ పాండు

జోగిపేట(అందోల్): ప్రజాక్షేత్రంలోనే రైతుల సమస్యలను పరిష్కరిస్తామని అందోలు–జోగిపేట ఆర్డీవో పాండు అన్నారు. సోమవారం అందోల్ ఆర్డీవో కార్యాలయం ఆవరణలో రీజినల్ రింగ్ రోడ్డుపై ఆయన ఆధ్వర్యంలో నిర్వాసితులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వివరిస్తామని తెలిపారు. ఒక రైతుభూమి సర్వేలో తక్కువ పోతున్నప్పటికీ ఎక్కువగా కోల్పోతున్నట్టు నోటీసులు వచ్చాయని, మరో రైతుకు ఎక్కువ భూమి కోల్పోతున్నా నోటీసుల్లో మాత్రం తక్కువ భూమి కోల్పోతున్నట్టు చూపించడం జరిగిందని ఇలాంటి సమస్యలు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం అవుతాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని చెప్పారు. అనంతరం నిర్వాసితులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ భూములు కోట్లలో విక్రయిస్తూ రైతుల భూములకు మాత్రం రూ.21లక్షలు నష్టపరిహారం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం వద్దు భూమికి భూమి కావాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చావడానికైనా సిద్ధమేనంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

హవేళిఘణాపూర్(మెదక్): అత్తింటివారి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పోచమ్మరాళ్ గ్రామానికి చెందిన బొప్పపురం మల్లికార్జున్ భార్య అనూష(22) గతనెల 29న భర్త, అత్తమామలతో గొడవపడి పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు సేవించి ఇంటికి వచ్చి అస్వస్థతకు గురైంది. ఇది గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను మెదక్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. తమ కుమార్తె ఆత్మహత్యకు భర్త మల్లికార్జున్, అత్త మామ పుల్లయ్య, సత్తవ్వ కారణమంటూ కుటుంబ సభ్యులు హవేళిఘణాపూర్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్‌రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఇరువర్గాలను సముదాయించారు.

అధిక వర్షం.. అప్రమత్తతే ఆయుధం

- పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలి
- నీటి నిల్వలు తొలగించుకోండి
- రైతులు మేల్కోకపోతే తప్పని ముప్పు
- జిల్లా వ్యవసాయ అధికారులు



నారాయణఖేడ్ : పత్తి చేనులో వర్షపు నీరు



నర్సాపూర్ రూరల్ : నీట మునిగిన మొక్కజొన్న

నారాయణఖేడ్/నర్సాపూర్ రూరల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట) : ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలతో సాగులో ఉన్న పంటలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. వర్షం వల్ల పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తుగా రైతులు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పంట చేతకొచ్చిన పెసర, మినుము చేలల్లో వర్షపు నీరు నిలవడంతో కోతకు వచ్చిన పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. దీని నివారణకు రైతులు భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొలం నుంచి మురుగు నీటిని తీసివేయాలి. రాబోవు రెండు రోజుల్లో తేలికపాటి నుండి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సాగులో ఉన్న ఆయా పంట పొలాల్లో మందులను పిచికారీ చేయడం తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

పత్తిలో జాగ్రత్తలు

- ముంపుకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13–0–45 లేదా 10 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- పిండి నల్లి సోకేందుకు అవకాశం ఎక్కువ ఉన్నందున ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా రెండు మిల్లీ లీటర్ల ఫిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- నేల ద్వారా వ్యాప్తి చెందే ఎండు తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్–ఆక్సి–క్లోరైడ్ లేదా ఆల్టర్నేరియా ఆకు మచ్చ తెగులు కొరకు 2. 5 గ్రా కార్బెండజిమ్ + మ్యాంకోజేబ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్టు వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

వరిలో ఆకు తెగులు..

- వరి పంట ప్రస్తుతం దుబ్బు చేసే దశలో ఉంది. బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉంది. కావున రైతులు 0.2 గ్రాములు ప్లాంటమైసిన్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- కాండం కుళ్లు రావడానికి కూడా అవకాశం ఎక్కువ. 2. 5 గ్రాముల కార్బెండజిమ్ + మ్యాంకోజేబ్ శిలీంద్రనాశక మందును లేదా ఒక మిల్లీలీటరు మైసిన్ వాలిడామైసిన్ కానీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- అగ్గి తెగులు కూడా సోకే అవకాశం ఎక్కువ. తెగులు గమనించిన పక్షంలో 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. రెండవ దఫా యూరియాని వేసుకోవడానికి అనుకూలమైన సమయం. బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించితే నత్రజని మోతాదుకు మించి ఉపయోగించకూడదు లేదా వేసుకోవడం వాయిదా వేసుకోవాలి.

ఉదారంగులోకి మొక్కజొన్న..

- అధిక వర్షాల వల్ల నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఉదారంగులోకి మారే అవకాశం ఉంటుంది.
- ప్రస్తుతం పంట మోకాలు ఎత్తు నుంచి జల్లు కట్టే దశ వరకు ఉంది. కావున వర్షాలు నిలిచిన తర్వాత మోకాలు ఎత్తు దశలో ఉన్నా పంటకు 5 గ్రా 19–19–19 లేదా 20 గ్రా డీఏపీ మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.
- వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత వర్షాధార పంటకు పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్‌ను వేసుకోవాలి.
- బ్యాక్టీరియా కాండంకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఎక్కువ. నివారణ కొరకు బ్లీచింగ్ పౌడర్‌ను 5 కిలోలు వేసుకోవాలి. కత్తెర పురుగును కూడా గమనించుకుంటూ అవసరమైనట్లయితే 0.3 మిల్లీ లీటర్ల క్లోరైంటిని పోల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మందుల పిచికారీ ఆపాలి



ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల నుంచి పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వర్షాలు కురిసి పొలాల్లో నీరు నిండితే మురుగు వెంటనే తీసివేయాలి. రాబోవు రెండు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారీ చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలి.

– జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, సిద్దిపేట